# గంప సంసారం

యాదయ్య కోసం చూసిచూసి తనుకూడా పని జరిగేచోటికి వెళ్ళాలను కుంది బక్కమ్మ. ఎండ మండిపోతున్నది. గుక్కెడు నీళ్ళకోసం కోసెడుదూరం పోయి తీసుకురావాలి. దారి పొడవునా కంకర్రాళ్ళ గుట్టలు, మట్టికుప్పలు, కొట్టి పడేసిన మొక్కలు కంపలూ-కాలిబాటన పోయి కుండతో నీళ్ళు తెచ్చుకోవాలి.

పదిమైళ్ళ దూరం రోడ్డు వేయడానికి కాంట్రాక్ట్ తీసుకున్నాడు కిష్టయ్య. అతడి చేతికింది మేస్త్రీ కూలీలను మాట్లాడివుంచాడు. పని పూర్తిగా అయ్యే వరకు అక్కడే గుడిసెలు వేసుకోవాలని చెప్పాడు. పాతికమంది అందుకు ఒప్పు కుని గంపల్లో సామాన్లు సర్దుకుని చాపమట్టలు చంకనపెట్టుకుని మేస్త్రీ గంగులు తెచ్చిన లారీలో ఎక్కారు. ముప్పయి అడుగుల వెడల్పు రోడ్డు వేయడానికి చిన్నచిన్న చెట్లూ, కంపలూ కొట్టి దారిచెయ్యడానికే ఆరునెలలు పట్టింది. కూలీ లందరూ అంతవరకు, చెట్లకింద పడుకున్నవాళ్ళు క్రమంగా దారికి పక్కగా వరు సగా గుడిసెలు వేసుకున్నారు. మేస్త్రీ గంగులు వాళ్ళ గుడిసెలకు పదిబారల దూరాన ఒక గుడిసె లేపాడు. కాంట్రాక్టరు కిష్టయ్య ఒక డేరా వేసుకున్నాడు. పదిమైళ్ళ దూరం పొడవునా జరుగుతున్న పని చూడడానికి సైకిల్ మీదవెళ్తాడు.

యాదయ్య కోసం బక్కమ్మ గుడిసె బైటికివచ్చింది. కనుచూపు మేరలో అతడి జాడలేదు. రొట్టెమూటకట్టుకుని పోవాలనుకుంటే పసిపిల్ల కేరుమన్నది.

సూర్యుడు నడినెత్తిమీద నుంచి పడమటికి దిగుతున్నాడు.

పని ఇవాళ సాగడంలేదా ? కూలీలు పని మీదనుంచి దిగేవేళ కాలేదా ?

సిద్దిపేట ముతకచీరె మోకాళ్ళదగ్గరికి కట్టుకుని, తలనిండా కొంగు కప్పు కుని, ఒడిలో పిల్లను బట్టతో బిగించి కట్టుకుంది బక్కమ్మ. గుడిసెకు కట్టిన గోనెపట్టాను దింపి, మూకుట్లో రొట్టె, కారం మూటగట్టుకుని, తల మీదకి సర్దు కుంటూ నడక సాగించింది పచ్చి బాలెంత బక్కమ్మ.

దారి పొడవునా రాళ్ళ గుట్టలు దాటుకుంటూ ఎర్రటి ఎండలో నడిచి పోతోంది.

కూలీ జనం మట్టి తవ్విపోస్తున్నారు. ఆడ కూలీలు మట్టి తట్టలు మోస్తున్నారు. మధ్యమధ్య గొంతులు తడుపుకుంటున్నారు.

"దొరా ! ఈడికి పని అపుసేసి దిగుతం దొరా !" కూలీలు ఒక్కొక్కరే గంగుల్ని అడుగుతున్నారు.

''ఏటిర మీ తొందర ? నేను గడేరం సూస్తూనే వున్న. ఏళయితే దిగమని నేనే సెప్తా'' మధ్యమధ్య తన గుడిసెలో దూరి రొట్టె తుంపులు తింటూనే వున్నాడు గంగులు.

ఎండాకాలం. ఎండిపోయిన నేలలోకి గునపాలు దింపలేక నీళ్ళుకారిపోతున్నారు కూలీలు.

"దొరా, టేము దాటిపోయింది. నీవు గడేరం సూస్తుండావు. మేము పొద్దు సూస్తుండాం. కడుపులు మాడిపోతుండాయి. గొంతులెండి పోతుండాయి" ఒక్కొక్కరే పారలు, గునపాలు, తట్టలు కిందపడేశారు.

''ఏందిరా ? అందరు ఒకపారే తట్టలు, పారలు కిందపడేసినరు ?''

"దొరా ! ఇంక సేతకాదు. బుక్కెడు తిని నీళ్ళుతాగి పనిమీద కెక్కుతం దొరా !"

''దిగండి దిగండి. కూలీలు ఇచ్చేటప్పుడు సూస్తాగా మీ పని" అంటున్నాడు గంగులు. అతడికి ఒక్కడికే కాస్త ఒంటినిండా బట్టలున్నాయి. కాళ్ళకు తెగిపోని చెప్పులున్నాయి మధ్యమధ్య అగిపోతూ నడిచే గడియారం వుంది చేతికి.

కూలీలంతా చేతులు కడుక్కుని ఒక చెట్టుక్రింద చేరారు. ఆడ కూలీలు చద్ది మూటలు విప్పారు. ఎవరి మూటల్లోంచి వాళ్ళు జొన్నరొట్టెలు చేతిలోకి తీసుకుని కారప్పొడి అద్దుకుని తింటున్నారు. రెండు రోజుల కొకసారి చేసిన రొట్టెలు కొయ్యముక్కల్లా వున్నాయి. నమిలినమిలి తినాలి. రెండేసి రొట్టెలు తిని ముంతడు నీళ్లు తాగి చుట్టముక్కలు వెలిగించారు కూలీలు. ఆడ కూలీలు

మూకుళ్లు కడుక్కొని మూటలు కట్టారు. ఆ చెట్టుకిందనే కొంగులు పరుచు కున్నారు.

తెగిపోయిన చెప్పులు కాళ్లకు తాళ్లతో కట్టుకుని రాళ్ళల్లోనుంచి మట్టి కుప్పల మధ్య నడుచుకుంటూ వస్తున్న బక్కమ్మను చూసి ఎదురెళ్ళి మూటనందు కున్నాడు యాదయ్య.

''ఇంకా పనిమీంచి దిగవేంటి ? సూసిసూసి పిల్లను ఒడిగ్గట్టుకుని బయ లెళ్ళిన."

జవాబు చెప్పడానికి యాదయ్యకు సమయం లేదు. చెట్టుకింద కూర్చుని మూట విప్పాడు. మాటా మంచీ లేకుండా రొట్టె నములుతున్నాడు. కూలీలంతా లేచి పనిలోకి వెళ్ళే వేళవుతుందేమోనన్న భయంతో ఆటూఇటూ చూసుకుంటూ తింటున్నారు.

ఆటు పిల్ల పాలు తాగుతున్నది. ఇటు యాదయ్య రొట్టె తింటున్నాడు. బక్కమ్మ కడుపు నిండుతోంది. మనస్సు తృప్తి చెందుతోంది.

''ఏందిర ? ఇంకా కాలేదు తిండి ? పనిమీదినుంచి దిగినరంటే అంతే. మళ్ళీ కేకలు పెడితే గాని ఎక్కరు'' పెద్దగా అరుస్తున్నాడు మేస్త్రీ గంగులు.

"దొరా. నీలుక్కపోయిన రొట్టె నమిలి నమిలి తినాలె దొరా. కొద్దిగా కూకుంటే గాని పనిమీదికెక్కలేం."

''ఎంతసేపుర. ఈయేళ గుత్తేదారొస్తడు. పని ఏంచేసినరంటె చూపియ్యా లనా వద్దా ?" అరుస్తున్నాడు.

"ఆడినుంచి ఈడిదాకా తవ్వినమా ? చెట్లు కంపాకొట్టినమా, కొలుసుకో"

కూలీలలో అందరికంటే కొమరయ్యకు అనుభవమెక్కువ. మొదటినుంచీ మేస్త్రీ గంగుల్ని కనిపెట్టి చూస్తున్నాడు. కూలీల చేత బాగా పని చేయించుకుని, కూలీ ఇచ్చేటప్పుడు లేనిపోని నేరాలు ఆరోపించేవాళ్లను, పై వాళ్లకు ఒక ధర చెప్పి, కూలీలకు ఒక ధర మాట్లాడేవాళ్లనూ బాగా ఎరిగినవాడు. గంగులు బెదిరింపులూ అరుపులూ వింటూ నోరు మెదపకుండా గంభీరంగా వున్నాడు.

అరగంట తరువాత కూలీ జనమంతా మళ్ళీ పనిలోకి ఎక్కారు. తవ్వేవాళ్లు

తవ్వుతున్నారు. మట్టిగంపలు మోసేవాళ్ళు మోస్తున్నారు. వీళ్లకు ముందు నలుగురు చెట్లూ కంపలూ కొట్టిపడేస్తున్నారు.

ఆ సాయంత్రం హుషారుగా ఈల వేసుకుంటూ గుత్తేదారు వచ్చాడు. మేస్త్రీ అతడివెంట వుండి అంతవరకు జరిగినపని చూపిస్తున్నాడు. ఇద్దరూ మాట్లాడుకున్నారు.

గుత్తేదారు కూలీల దగ్గరకొచ్చి ''మీరంతా ఒళ్లొంచి యేగిరం పని చెయ్యాలె. పని కొద్దిగనే అయింది. రేపు కూలీ ఇచ్చేరోజు'' అన్నాడు.

కూలీలంతా గుత్తేదారు దగ్గరికి ఒక్క పరుగున వచ్చారు.

"దణ్ణాలు దొరా, యేగిరమే పని చేస్తుండం దొరా. మా సేతులు సూడండి. బొబ్బలొచ్చి మంటలేస్తున్నయ్. భూమి ఎండిపోయింది. గడ్డపార దిగుతులేదు" ఒంగిఒంగి దణ్ణాలు పెట్టారంతా.

"దణ్ణాలు కాదుర. పని జరగాల"

చెట్టుకింద నిలబడి ఇదంతా చూస్తున్న కొమరయ్య కదిలి వచ్చాడు. గుత్తేదారుకు దణ్ణం పెట్టాడు.

అతడిని వింతగా చూశాడు గుత్తేదారు.

''నీవూ కూలోడివేనా ?''

''అవును దొరా''

"పని అనుకున్నంత యేగిరం సాగుతులేదు''

"దొరా, మేము ఈ పనిలోకి ఆరు నెలలాయె వచ్చి. ఒక్కనాడయినా కూకోలేదు"

"ఆరునెల్ల పనికాలేదు గదర ?''

"పని కాలేదా? ఇగ సూడుదొర" మొలలో నుంచి నులకతాడు తీశాడు. "ఈ తాడు కొలుసుకో. నూరు గజాలది. దీనితో కొలుసుకుంటా గెంట్లు పెట్టిన లెక్క సేస్కో దొర. నేల గట్టిగుండది. గడ్డపారలు దిగుతులేవు."

గుత్తేదారు దారి పొడుగున పెట్టిన గెంట్లన్నీ లెక్కబెట్టుకుంటూ వచ్చాడు. ఇంక రెండుమైళ్ల దూరమే వుంది. అనుకున్నదానికంటే పని తొందరగా అవుతుందని అంచనాకట్టాడు మనసు ఆనందంతో గంతులువేసింది. కాని, తన ముందున్నది కూలీ జనం. తను మాట్లాడవలసింది వాళ్లతో. మేస్త్రీతో మాట్లాడి వెళ్ళిపోయాడు.

కూలీ ఇచ్చేనాడు అందరినీ సమావేశపరిచి మేస్త్రీ ఒక రాతిమీద ఎత్తుగా కూర్చుని-''మీరెవరూ ముందుగల చేసినట్టు పని చేస్తులేరని అన్నాడు గుత్తేదారు. మీకిచ్చే రోజుకూలీలో ఒక్కొక్క రూపాయి తగ్గించమన్నడు. నా సేతిలో ఏం లేదని ముందుగ చెప్పిన. ఒక్కొక్కరే వచ్చి తీసుకోండి" అన్నాడు.

కొండంత ఆశతో డబ్బుకోసం ఎంతో దూరాన్నించి వచ్చినవాళ్లా కూలీలు. ఒకడు కూలీ డబ్బులలో కొన్ని రూపాయిలు మిగిల్చి పెళ్లాం పిల్లలకు పంపాలనుకున్నాడు. తన తల్లీకి, తమ్ములకు కొంత డబ్బు పంపితే రెండు పూటలా ఇంత జొన్నగటక తాగుతారని ఆశపడ్డాడు. ఒకడు మంచంలో వున్న తండ్రికి నాలుగు రోజుల కూలీ అయినా పంపాలనుకున్నాడు. పెళ్లాం బిడ్డలతో ఇక్కడైనా కొంతకాలం వుండి కడుపునిండా తిండి తిందామని వచ్చినవారు కొందరు. ఈ ఎండలకు, కష్టమైన పనికి చిక్కిశల్యాలయినా వారం కాగానే కూలీ డబ్బులు చేతిలో పడతాయని సంబరపడ్డారు. విసుగు, కోపమువచ్చి వెళ్ళిపోవాలనుకుని కూడా ఈ కూలీ డబ్బులకోసమే ఆగారు. లారీలో వచ్చారుకనుక తిరిగి వెళ్లడం కష్టమే. అంటే నడవాలి. ఎంత దూరమని నడుస్తారు? ఎన్నాళ్లని నడుస్తారు?

మేస్త్రీ మాటలకు కూలీలలో కొందరికి కళ్ళ నీళ్ళొచ్చాయి. కొందరు పళ్లు కొరుక్కున్నారు. కోపాన్ని దిగమింగారు. ఆడ కూలీలు పైకేఏడ్చేశారు. ఒకామె రోజుల పిల్లను ఒళ్ళో పెట్టుకుని భోరున ఏడ్చింది. మగ కూలీలలో కొందరికి కోపం బుసబుస పైకి పొంగింది.

"అన్నాయం సేయకు దొరా. మనస్సాచ్చిగా సెప్పుదొరా! మేం పని సెయ్యలేదూ? సెయ్యకుండానే ఇంతలెక్క పని జరిగిందా దొరా? మా కడుపులు కొట్టకుదొరా'' ఒంగిఒంగి దణ్ణాలుపెట్టారు కొందరు.

మేస్త్రీ మనసు కరగలేదు. ఊళ్లోవున్న ఆడదానికి మెడలోకి గుళ్ళు చేయిస్తానని చెప్పివచ్చాడు. పుస్తెకట్టిన పెండ్లానికి, పిల్లలకు గంజినీళ్ళకు డబ్బు పంపుతానని చెప్పాడు. కూలీలందరినీ బెదిరించి, మిగిల్చి, వారానికి పాతిక రూపాయిలు పంపుతానని చెప్పివచ్చాడు.

ఆరు నెలలనుంచి జరుగుతున్న అన్యాయాలను చూస్తూ కోపాన్ని అణచు కుంటున్న కోడెతాచు కొమరయ్య. గుంపులో నుంచి లేచి మేస్త్రీ ముందరికొచ్చి నిలబడ్డాడు నడుమ్మీద చేతులు పెట్టుకుని.

''ఏందిర ముందుకొచ్చినవు మొనగాడిలా ?'' మేస్త్రీ గుండెలో సన్నగా దడ మొదలయింది అతడిని చూసి.

''ఏమన్నవు మేస్త్రీ ? పని సరింగలేదూ ? వచ్చిన కాణ్ణించి చూస్తుండా నీ సంగతి. కూలీలిచ్చేనాడు పేచీపెడతవా ? పెతిరోజూ పని బాగా లేదని సతా యిస్తవా ? ఎంత మిగులుస్తున్నవ్ ? అ .... సెప్పు ?'' మరో అడుగు ముందుకు వేశాడు.

మేస్త్రీ గుండె గబగబా కొట్టుకోవడం మొదలు పెట్టింది.

నేను లారీ తెచ్చిన్నాడే చెప్పిన. పని బాగా చేయకుంటే కూలీ తగ్గిస్తానని ధైర్యం తెచ్చుకుని అన్నాడు మేస్త్రీ.

"ఏం బాగు? కండలు కరిగినయ్. కడుపులు మాడినయ్. సేతులు బొబ్బలెక్కినయ్. కూసింతసేపు కూకోలేదు. యేగిరం ఇళ్ళకు పోవాలని సేసినమ్ అటు సూడు ఆ ఆడదాన్ని. పొట్టతో వుండి తట్టలు మోసింది. రోగంతో తట్టలు ఎత్తుతున్న ఆ ఆడదాన్ని సూడు. ఎండగొట్టి సచ్చిన పిల్లగాణ్ణి పారేసి ఏడ్చుకుంటూ వచ్చి తట్టలు ఎత్తుతుండది అటు సూడు, ఆ ముసిలాణ్ణి సూసినవా? నడుం ఒంగిపోయింది. గడ్డపార భూమిలోకి దింపలేడు. ఆడ దానిలా తట్టలు మోస్తున్నాడు. ఎందుకొచ్చినరు ఈళ్ళంతా నీతోగూడా? తిండికి లేక కూలీ దొరక్క. అసుమంటివోళ్ళ కడుపులు గొడతవా?''

అక్కడికి నాలుగు మైళ్ళయినా నడిస్తేగాని ఏ గ్రామం రాదు. ఇంతకాలం వాళ్ళలో ఒకడు పదిహేనురోజుల కొకనాడు గ్రామానికివెళ్లి జొన్నలు కొని మరకుపోసి పిండి తెస్తున్నాడు. వారానికి కావలసిన అల్లం, మిరపకాయలు,

వెల్లిగడ్డ తెస్తాడు. అందరూ పంచుకుని రొట్టెలు చేసుకుంటున్నారు. రాయి మీద రాయి పెట్టి కారం నూరుకుంటున్నారు. నాలుగు రోజులకొకసారి రొట్టెలు చేసుకుని ఉట్టిమీద పెట్టుకుని కొయ్యబారిన ఆరొట్టెలనే తింటున్నారు. ఆడ కూలీలలో యాదమ్మకు పురుడు అక్కడే వచ్చింది. తోటి ఆడకూలీలంతా ఆమెకు తోడుగా నిలిచారు. పన్నెండురోజులే పనికిపోలేదు యాదమ్మ. ఊళ్లో అత్త దగ్గరుంచిన పిల్లలకు గంజినీళ్ళయినా వున్నాయో, లేదో? రొట్టె తినలేకపోతున్నది.

వాళ్ళకు ఊళ్ళో పనులు లేవు. ఆ చుట్టుపక్కల గ్రామాలన్నీ అట్లనే వున్నాయి. జనానికి కడుపునిండా తిండి లేదు. తాగేటందుకు నీళ్లు లేవు. సుఖమంతా నిద్రలోనే. కళ్ళు తెరిస్తే కడుపులో మంట. ఒంటికి నిండుగా బట్ట లేదు. నిలవడానికి గూడు లేదు.

నానా ఆగచాట్లు పడుతున్న కూలీజనం మేస్త్రీ పనిఇప్పిస్తానని లారీ తీసుకురాగానే పాతికమంది సంబరంగా లారీ ఎక్కారు. పని చురుకుగా సాగు తున్నా కూలిలిచ్చేనాడు గుత్తేదారు ఇచ్చిన డబ్బులోనుంచి కొంత బిగబడ తాడు మేస్త్రీ గంగులు.

కూలీలంతా ఆరోజుకోసం ఎదురుచూస్తారు ఆశతో. ఇచ్చేనాడు ప్రాణం ఉసూరుమనిపిస్తాడు గంగులు. 'ఇంకెన్ని రోజుల్లే' అనుకుంటూ కూలీలు రోజులు గడుపుతున్నారు. కొమరయ్య కూలీగుండె ఆనాడు మండింది.

"ఈడికొచ్చినకాడి నుంచి ఇట్లనే సేస్తున్నవు కద మేస్త్రీ? ఎన్నడయినా నిండు కూలీ ఇచ్చినవా?

"కూలీ ఇయ్యకపోతేనె మీరంత రొట్టె తింటున్నార్రా?"

''ఆ రొట్టె తిని నాలుగు పైసలు యెనకేసుకోవాలని రాలేదు. ఆ రొట్టె యినా కడుపు నిండా తినాలని, మావోళ్ళకింత తినిపించాలని వచ్చినం. ఈడి కొచ్చినంక పనిసూస్తే బాగుంది. గెట్టిభూమి. ఎక్కువకూలీ ఇచ్చేదిపోయి ఇంత తగ్గిస్తవా మేస్త్రీ?''

"గుత్తెదారిచ్చినంత మీకిస్తగాని, నా జేబులోంచి కాదుగద" మేస్త్రి లేచాడు.

కొమరయ్య వెనుదిరిగాడు. కూలీలు చూస్తూ నిలబడ్డారు.

రాత్రి రెండు గంటలకు కొమరయ్య లేచాడు. చప్పుడు కాకుండా తన సరుకులన్నీ మూటగట్టాడు. ఒక్కొక్క గుడిసెలోకెళ్ళి అందరినీ మూటలు కట్ట మన్నాడు. వాళ్ళకు కొమరయ్య మాటంటే గురి. కొమరయ్య చెప్పగానే అందరు గుడ్డలు, కుండలు గంపలకెత్తారు. చప్పుడు కాకుండా చీకటిలో కాలి బాటన నాలుగు మైళ్ళు నడిచారు. ఊరి ముందర చెట్టుకింద దిగారు.

ఆ చెట్టు చాలాయేళ్ళనాటి చింతచెట్టు. కొమ్మలు విస్తరించి చుట్టూ నీడను కల్పిస్తున్నది. కూలీలందరూ ఈతాకుల చాపలు పరుచుకుని ఒకకునుకు తీశారు. అందరికంటె ముందు లేచినవాడు కొమరయ్య. వెలుగు రేఖలలో. ఆ చుట్టుపక్కలకు వెళ్ళి ఊరి బావి ఎంత దూరంలో వుందో చూశాడు. అక్కడికి ఫర్లాంగు దూరంలో బావివుంది. తొంగిచూస్తే నీళ్ళు చాలా లోతుగా కనబడ్డాయి. అక్కడి నుంచి తిరిగి వస్తూ ఆలోచించాడు. అందరికీ కాలకృత్యాలు తీర్చుకోవ డానికి. తాగడానికి, వంటలకు మూడు నాలుగు కడవల నీళ్ళుకావాలి. తమ దగ్గర తాడులేదు. బొక్కెన లేదు ఎలాగ?

ఆలోచిస్తూ ఆ బావి దగ్గరే రాతిమీద కూర్చున్నాడు కొమరయ్య.

ఒక అరగంట తేడాలో అందరూ నిద్రలు లేచారు. చాపలుచుట్టి చెట్టు పక్కన పెట్టారు. ఒకరిద్దరు చిన్నపిల్లలు పడుకున్నచాప మాత్రం వుంచి వాళ్ళకు బట్టలు సరిగా కప్పారు. అందరూ ''ఏటిసేద్దాం? ఏటి సేద్దాం? నీళ్ళ బొట్టు కావాలి'' అనుకుంటూ మధనపడుతున్నారు.

"మన కొమరయ్యేడి?"

''చుట్టుపక్కల నీళ్ళకోసం ఎళ్ళుంటాడు.''

''బావి చూడబోయిండేమో?''

''ఆడు మనకు పెద్ద. మన కోసమే కష్టపడతడు"

కొమరయ్య బావి దగ్గరికి ఎవరు వస్తారా అని ఎదురుచూస్తున్నాడు. కొంత

సేపటికి కావడిలో రెండు కుండలు పెట్టుకుని నీళ్ల తోడడానికి ఒక బుంగ, తాడు తీసుకుని ఇద్దరు మనుషులు వచ్చారు.

వాళ్ళను చూడగానే కొమరయ్య దిగ్గునలేచాడు.

"నేను వట్టిగనే కూసున్న. బుంగతో బావిలో నుంచి నేను నీళ్లతోడిపోస్త''

''మేము నీళ్ళు లాక్కుంటాము. నీవెవరు?''

"మేము ఓ పాతిక మందిమి, ఓ ఆడ రోడ్డు ఏసి వస్తుండాము. ఆ సింత సెట్టుకాడ మావోళ్లున్నరు'' వాళ్ళ చేతిలోనుంచి తాడు, బుంగ తీసుకుని నీళ్ళు తోడిపోశాడు. వాళ్ళు కావడి లెత్తుకుంటుండగా ''మళ్ళొస్తరా?" అడిగాడు.

''ఇట్లా పదిసార్లు తిరగాలి. మేమే గాదు ఈ ఊరందరికీ ఇదే బావి. అందరు వొస్తరు''.

"మీరు వచ్చేదరక ఈ బుంగతో మేము నీళ్ళు తోడుకోమా? మీరొచ్చినంత మళ్ళీ నేనే నీళ్ల లాగిస్త."

ఇద్దరూ కొంతసేపు నిలబడిపోయారు. వాళ్ళ ముఖాలతో భయం, సందేహం కొంతసేపు దోబూచులాడాయి. సందేహం వీడక ఒకడు అక్కడ వుండి, ఒకడు మాత్రమే వెళ్ళాడు.

అంతలో కొమరయ్య వాళ్ళగుంపుకు వినబడేటట్టు కూతలేశాడు. మగ వాళ్లు పరుగు పరుగున వచ్చారు. కొమరయ్య నీల్లు తోడిపోస్తె వాళ్ల ముఖాలు కడిగి చెట్టు దగ్గరకెళ్ళి తమ గంపలలో నుంచి ముంతలు, దాకలు, రెండు కడవలు తెచ్చి నీళ్ళు నింపి తీసుకెళ్లారు.

అలా బావి దగ్గర కొచ్చిన వాళ్ళకు నీళ్ల తోడిపోస్తూ ''అన్నా ఈ ఊళ్ళో ఉప్పరి పనులేవయినా దొరుకుతయా?'' అడిగాడు.

''అడిగి తెలుసుకోవాలి.''

"దారీ చూపిస్తె నే బోతా.''

''నా యెంట రా"

ఆ గ్రామానికి ఒక పెద్ద రెండు సందులు దాటిన తరువాత ఒక పెద్ద

పెంకుటింట్లో వుంటున్నాడు. ఆయనకు ఇంటినిండా సంతానమున్నట్టుంది. కొమరయ్య వెళ్ళగానే ఇంటి యజమాని అప్పుడే స్నానం చేసి వీధి అరుగుమీద కూర్చుని వున్నాడు.

చేతులు కట్టుకుని ఎదురుగా నిలబడ్డ కొమరయ్యను "నీదీ ఊరుకానట్టుంది. ఎక్కడి నుంచి వచ్చావు?" అడిగాడాయన.

"ఉప్పరి పని చేస్తం దొర. పనులుంటాయేమో అరుసుకుందామని వచ్చినం. మేం పాతికమందిమి రాత్రి వచ్చినం" అన్నాడు కొమరయ్య వినయంతో.

"కూలీకి ఇంత దూరం వచ్చారా?"

"అవు దొర. మొన్నటిదనుక రోడ్డు ఏసినం. అది అయింది."

కొంతసేపాలోచించాడు ఆయన. "నేను రెండు పెంకిటిళ్ళు కట్టాలనుకుంటున్నాను. ఇటు రెండు గదులూ, అటు రెండు గదులూ, మధ్య పెద్ద సావిడి, ముందువైపు వసారా, వెనుక వైపు ఒక వసారా-అందులోనే భోజనాలు వంటయిల్లు అడ్డగోడలతో అమర్చాలి. ఈ రెండిళ్ళకూ ఇటికెలక్కర్లేదు. గడలతో పెండెకట్టి మట్టిముద్దలతో గోడలు పూయాలి. మధ్యలో రెండు స్థంభాలు పాతి నిలువుగా రెండు కడ్డీలు వేసి తడకలు వెయ్యాలి. దానిమీద పెంకు కప్పాలి. దర్వాజాలు చేయించి పెట్టాను. మీరు ఎన్నాళ్లు కడతారు? కూలి ఎంత?"

కొమరయ్య ముందుకు వచ్చాడు. "మేం ఆడామగా కలసి పాతికమందిమి వుండాము. రోజు కూలి సేసుకోండి. ఆడకూలీకి ఎనిమిది రూపాయలు, మగ కూలీకి పన్నెండు. పని అయినంక ఇనాంలు ఇయ్యండి."

"అబ్బో! చాలా చెప్పావు."

"మీ మాట సెప్పండి."

"ఈ ఊరి ధరలు అంతలేవు. మగవాడికి ఆరు. ఆడదానికి నాలుగు. ఆఖరు మాట కూడా ఇదే."

కొమరయ్య "అలోచన సేసి సెప్పు బాబయ్యా" అంటూ వెనక్కు తిరిగాడు. అతడు ఊరి బావి దగ్గరకొచ్చి నీళ్ళల్లోకి చూశాడు. చాలాలోతుంది

బావి. ''మట్టి కలపడానికి చాలా నీళ్లు తోడిపొయ్యాల. కూలి తక్కువ ఇస్త నంటడు'' అనుకుంటూ చెట్టుకింద వాళ్ళను కలిసాడు. అతడొచ్చేసరికి ఆడ కూలీలు రొట్టెలు చేశారు. కొమరయ్య రాగానే అందరూ రొట్టె తినడానికి కూర్చున్నారు.

''ఈ ఊళ్ళో పని దొరికితే వుందామా?'' అడిగాడు కొమరయ్య.

"ఏం పని? ఎన్ని దినాలు? ఎంత కూలి?'' నలుగురయిదుగురు ఒక్క సారే తింటున్న రొట్టెను వదిలిపెట్టి ముఖాలు పైకెత్తారు.

''పెండె కట్టిన మట్టిళ్ల రెండు కట్టాలంట ఈ వూరి పెద్దకు. రెండు నెలలకు పైగా వుండాలె."

"కూలి ఏమిస్తడు?"

''అడ కూలీకి నాలుగు, మగకూలీకి ఆరుకంటె ఇవ్వనన్నడు.''

''అదయిన మంచిదె కద? మన మిప్పుడెక్కడికి పోవాలె? ఎవరిస్తరు పని?''

''ఎంత దూరమని పోతం?"

అందరి ముఖాలు చూశాడు కొమరయ్య. పనికోసం విలవిల్లాడుతున్నారు. ఎంత కూలి ఇచ్చినా చేసేటట్టే వున్నారు. కడుపులు ఆవురావురు మంటున్నాయి.

"సూడు కొమరయ్యన్నా. తెల్లారగనే వెళ్ళి మాట్లాడిరా. నీ మాటలు మేమందరం వినేటోళ్లమే గద! నాలుగు రూపాయిలొస్తే ఎంత పనైన సేస్తం. నీవు మాతో కూడా వుంటే సాలు"

కొమరయ్య కళ్ళు మిలమిల్లాడాయి. తనకంటె కూడా గంజినీళ్ళకులేని వాళ్ళు వాళ్లంతా. తనకు ఊళ్లో స్వంతగుడిసెయిన వుంది. వాళ్లవి చెట్టు కింద బతుకులు. తన కొడుకయినా నెలకు రెండు రూపాయలిచ్చి అక్షరాలు పొరుగూరు వెళ్ళి నేరుస్తున్నాడు. వాళ్ల పిల్లలు పుల్లలేరుకొచ్చి అమ్ముకుంటున్నారు చారెడు గింజల కోసం.

మరునాడు వెలుగు చూస్తూనే కొమరయ్య లేచి ఊరి పెద్దను చూడడానికి వెళ్ళాడు. ఆయన వాకిట్లోకి రాగానే లేచి నిలబడ్డాడు చేతులు నలుపుకుంటూ.

"నిన్నటి కూలీ మనిషివేనా? ఏమాలోచించావు మీ వాళ్లతో?''

''బాబయ్యా. మేమింత దూరం వచ్చినమని అడుగుతున్నం గాని - మీరిస్త మన్న కూలి చాలదు. ఐదయిన ఆడ కూలీకి ఇప్పించండి. ఏడు మగవాడికి య్యాల. అంతకంటె తగ్గమంటున్నరు. పేదవోళ్లతో బేరాలు సేయకండి బాబయ్యా."

ఊరి పెద్ద ఆ సాయంకాలానికి వచ్చి కనబడమన్నాడు.

ఊరి పెద్దకు ఇంటి పరిస్థితులు ఏ రోజుకారోజుకు గండంగా వుంది. కొడుకు లిద్దరికీ పెళ్లయింది. అక్కడికి నాలుగుమైళ్ళ దూరాన వున్న మెట్ట పైరు చూడడానికైనా కొడుకులు వెళ్లరు. కోడల్లు వాకిలి ఊడవటానికయినా రారు. ఇంటి ఇల్లాలు వండి వార్చిపెట్టడానికే పన్నెండుగంటలు చేస్తుంది. అంగణమంతా ఊడ్చి, పేడ కలాపి చల్లి, ముగ్గుపెట్టి. గొడ్ల దగ్గర బాగుచేసి పాలు తీస్తుంది. జొన్నలు తొక్కి కుడితి తొట్లో ఒంపుతుంది. ఆమె దగ్గూ, ఆయాసం మనిషి. పడుతూ లేస్తూ పెరట్లో కూరలుతెచ్చి వంట మొదలుపెడు తుంది. పెరట్లో పందిరికింద వంట. జొన్నన్నం వండి, దోసకాయ పులుసుచేసి అక్కడే ఒరుగుతుంది. వచ్చిన వాళ్లకు కంచంలో వడ్డిస్తుంది. ఆడపిల్లలు పనిలో కాస్త ఆసరాగా వుంటారు. ఇద్దరు మగపిల్లలు మిరప చేను దగ్గర కాపలా వుంటారు.

ఇంటియజమాని భార్యబాధ చూడలేదు. కొడుకులను మందలించలేదు. కోడళ్లను అత్తకు సహాయం చేయమని అడగలేదు.

''నన్ను మా వోళ్ళింటికి పంపండి. నెల వుండివస్తా" అంటుంది భార్య.

ఆమె వెళ్ళితే పొయ్యిలో పిల్లిలేవదు. ఆ పన్నెండు గంటలకయినా జొన్నన్నం కంచంలోకి రాదు.

యజమాని ఏం చెయ్యలేక ఊరికె ఇటూ అటూ తిరుగుతాడు.

అతడికి ఎంత ఆలోచించినా కొడుకులను వేరే వుంచడం తప్ప, మరొక ఆలోచన రావడంలేదు. ఎంత తొందరగా ఇల్లు కట్టించి వేరే వుంచితే ఆ యిద్దరు కొడుకులకు అంత మంచిదని ఒక నిర్ణయానికి వచ్చాడు. కూలీ దగ్గర రూపాయి

తేడా వస్తున్నది. పాతిక మందికి పాతిక రూపాయలు ఎక్కువగా రోజుకు ఇవ్వాలి. కాని తప్పదు.

కొమరయ్యను చూడగానే ''మీ వాళ్లంతా ఏమంటున్నారు?'' అడిగాడు.

"'అంతకు తగ్గమంటున్నారు బాబయ్యా.''

"సరే, కానీ. రేపు తెల్లారకుండా మొదలు పెట్టాలి-మంచి గడియలు దాట కుండా, పనిముట్లున్నాయా మీకు?''

''మా దగ్గరెక్కడివి బాబయ్యా?''

''సరేలే, అటక మీది నుంచి దింపిస్త. నాలుగో జాముకే ఇక్కడుండాలె అందరు."

''సరే బాబయ్యా!''

కొమరయ్యా చెట్టు కింద అందరినీ కుర్చోబెట్టుకుని చెప్పాడు. అందరూ సంబరపడ్డారు. ''మరి రెండు మూడు నెలలయిన ఇట్ల గడుస్తయి కద?'' అను కున్నాడు. రొట్టె తిని చుక్కలు చూసుకుంటూ పడుకుంటే ఎంతో సేపటికిగాని కళ్ళు మూతలుపడలేదు.

నాలుగోజాముకు లేచి కడవలోవున్న నీళ్లతో ముఖాలు కడిగారు. చాపలు చుట్టుకుని, ఎవరిగంప వారు తలకెత్తుకుని ఊరించే ఆశలతో-ఊసులాడు కుంటూ బయలుదేరి ఊరిపెద్ద ఇంటికి వచ్చారు.

అప్పటికే పక్క ఊరి పురోహితుడు వచ్చాడు. దీపం వెలిగించి పాలేరు వెంటరాగా యజమాని భార్యతో బయలుదేరి ఇళ్ల స్థలానికి చేరుకున్నాడు.

పారలు, గంపలు, గునపాలు మరో పాలేరు తెచ్చిపెట్టాడు.

యజమాని చెప్పినట్టుగా ముగ్గుతో గీతలు గీశాడు కొమరయ్య. ఇద్దరు కూలీలు పురోహితుడు చెప్పిన చోట తవ్వారు. యజమాని ఒక రాయి వేశాడు. ఆయన భార్య పసుపు కుంకుమ చల్లి కొబ్బరికాయ కొట్టింది.

తెల్లవారగానే కూలీజనమంతా గంపలు పెట్టినచోటకెళ్ళి ఒక్కొక్క రొట్టె తిని పని మొదలుపెట్టారు. కొందరు నీళ్ళు తోడడానికివెళ్ళారు. ఆడ కూలీలు నీళ్ల

మొయ్యడానికి చీరెలు పైకికట్టి చుట్టలు తలమీద పెట్టుకొని కడవలతో వెళ్ళారు. గీత పొడుగునా కొందరు తవ్వుతున్నారు. కొందరు మట్టితట్టలుమోసి కుప్ప చేస్తున్నారు. కొందరు కర్రలుపాతుతున్నారు.

పదిహేనురోజులకు పెండెకట్టడం తయారయింది. యజమాని దగ్గరుండి పని చూసుకుంటున్నాడు. ఏ రోజు కూలీ డబ్బులు ఆ రోజు కొమరయ్య చేతికిస్తు న్నాడు. కొమరయ్య యజమాని వెళ్ళినతరువాత ఆడకూలీలకు నాలుగు రూపా యిలూ, మగకూలీలకు ఆరురూపాయిలూ చేతిలో వేస్తున్నాడు. పొద్దు దిగంగానే కూలీలు పనిమీదినుంచిదిగి సంతోషంగా కూలిడబ్బులు మూటకట్టుకుంటున్నారు.

ఆ మరునాటినుంచీ మట్టికుప్పలో నీళ్లుపోసి కాళ్ళతోతొక్కి అడుసు తయారు చేస్తున్నారు కొందరు. ఆడకూలీలు నీళ్ళు అందిస్తున్నారు కొమరయ్యతోసహా గంప లతో తెచ్చిన అడుసు ముద్దలుచేసి పెండెంకొట్టి గోడలులేపటం మొదలు పెట్టారు. వేళచూసుకుని కూలీలు పనిమీదనుంచి దిగుతున్నారు సంబరంతో రొట్టెలు తింటున్నారు.

పడుకునేముందు "కొమరయ్యన్న కడుపుసల్లగ ఈడికితెచ్చి మన కడుపులు నింపుతున్నడు" అని తలచుకుంటున్నారు.

రెండుఇళ్లూ కట్టి పూర్తిచేయడంలో ఆలస్యం జరగలేదు. యజమానికి తృప్తిగా పనిజరిగింది. అందరికీ భోజనాలుపెట్టించాడు. వాళ్ళకు ఇనాములిచ్చాడు.

కొమరయ్య తన తండాను మళ్ళీ బయలుదేరదీశాడు. ఒక చోట నాట్లు వేయించాడు. ఒకచోట కలుపు తీయించాడు. మరోచోట కాలువలు తవ్వించాడు. ఎక్కడయినా కొమరయ్య కూలీ పనూలుచేస్తున్నాడు. అందరికీ పంచుతున్నాడు.

ఒకనాడు మల్లన్న తోటికూలీని కొమరయ్య లేనప్పుడు పిలిచి "నాకేటో అనుమానంగావుందిర. ఈడు మనకు కూలీ సరింగ ఇస్తున్నాడా?" చెవిలోఊదాడు. వాడికీ అనుమానంకలిగింది అనుమానమేకాని ఆధారం దొరకటంలేదు.

పదిరోజులయ్యేసరికి ఈ అనుమానం అందరిలోకి పాకింది. కాని కొంద రింకా "ఆడు చెయ్యబట్టే మనం కడుపునిండా రొట్టె తింటున్నాం" అనుకుంటు న్నారు. ముతకవయినా మారుబట్టలు కొనుక్కోగలిగారు. అంతటికే తృప్తి కడుపు లోకి తిండి-ఒంటినిండా గుడ్డ.

కొమరయ్యపని జోరుగావుంది. హుషారుగా మాట్లాడుతున్నాడు. తన చేతి కింద కూలీజనమున్నారు. తనమాటకెదురులేదు. ఒంటరిగా ఉన్నప్పుడు డబ్బులు లెక్కబెట్టి సంచిలో పెట్టుకుంటున్నాడు. ఈ పని అయిపోతే మరో చోటికి వెళ్ళా లన్న ఆలోచనలు చేస్తున్నాడు.

ఒక ఊర్లో నాగార్జునసాగర్‌లోనుంచి నీళ్లురావడానికి కాలవలు తవ్వటానికి మాట్లాడటానికివెళ్లాడు. అతడువచ్చేసరికి పొద్దుపోయింది హోటల్లోతిని ముంతెడు గుడుంబా తాగివచ్చాడు. మత్తులోఉండి చాపపరచుకుని పడుకున్నాడు.

తెల్లవారి అతడు లేచేసరికి పాతికమందిలో పది మంది లేరు:

"మల్లన్న వాళ్ళేరి?" ఇటూ అటూ చూశాడు.

''మల్లన్న ఇంటికి బోతనని బయటకి వెళ్ళగనే మేమొస్తమని అళ్లుకూడా ఆడెంట పోయినారు'' ఉన్నవాళ్లు చెప్పారు.

''మళ్లీ ఎన్నడొాస్తరు?''

''ఆ మాట చెప్పలే''

కొమరయ్య మేస్త్రీ గంగులు మాదిరిగా కూలీలమీద పెత్తనంచేస్తూ అప్పు డప్పుడు ఆగిపోయే గడియారమొకటి కొనాలనుకుంటున్నాడు. ఇంటిదగ్గర పిల్లకు మనువు కుదిరిందని కబురువచ్చింది కాలవలతవ్వకమయిన తరువాత డబ్బు తీసు కుని వస్తానని ఇంటికి కబురు చేశాడు.

కొమరయ్య ముఖం వేలాడిపోయింది చేతిలోవున్న కూలీలు జారిపోయారు. మళ్లీ కొత్తవాళ్లని కూడగట్టుకోవాలి 'ఆలస్యమయితే మరొకడొస్తడు" అన్నభయం.

ఆ రోజంతా ఇటూ అటూ తిరిగాడు తెల్లవారకుండానే తన సామాను తీసు కుని వెళ్ళిపోయాడు.

ఆ మిగిలిన పదముగ్గురూ ఒకచోట చేరారు. మాటల్లేకుండా ముఖాలు చూసుకున్నారు కొంత సేపు.

"ఏమన్నా ఈ ఉళ్లోపనిలేదు ఎక్కడికిపోదంమరి. ఈడకూకోని ఏంతింటం? ఏమన్నా, ఏమంటవు?"

"పోదం సరే. ఎటు పోదం?"

''పోతుంటే ఏదయినా పని దొరకదా?''

''అనకాలమొచ్చింది. ఏదయినా పనిదొరుకుద్ది'' ఇంకొక డందుకున్నాడు.

''పోదం నడవండి ఈడకూకోని సేసేదేముంది?''

అక్కడక్కడ ఆగుతూ నడిచినడిచి ఓ గ్రామం చేరుకున్నారు. అక్కడందరూ చేసుకునేవాళ్ళే గాని పనిచేయించుకునేవాళ్లు లేరు. ఉసూరుమంటూ ఆ గ్రామందాటారు. ఎంతదూరం నడిచినా నాలుగురోజులూ ఐదురోజులూ కూలీ దొరికేది. ఆ తరువాత గంపలు తలకెత్తుకుని మళ్లీ ప్రయాణం రెండు నెలలయ్యేసరికి యాదయ్య కుటుంబం ఒక్కటే మిగిలింది.

''మనంకూడ ఇంటికి పోదమయ్యా. పోయి ఈ రూపాయలు పిల్లగాడికిచ్చి ముసల్ది ఎట్టుందో సూదామయ్యా'' అందరూపోగానే బక్కమ్మకూ పోవాలనిపించింది.

''ఇంటికి పోదామంటవుగాని ఆడఇల్లుందా? పూరిగుడిసెకయిన జాగాలేదు. గుడిసె కట్టటానికి దబ్బులేయే?''

ఏ సెట్టుకాడుంటే అదేగూడు. అదే గుడిసె. ఆడికేపోదం.

యాదయ్య మారు మాట్లాడలేక బక్కమ్మ చెప్పినట్టే చాపచుట్టి చంకన బెట్టుకుని పిల్లను బుజమ్మీది కెక్కించుకుని అడుగులేశాడు. బక్కమ్మ గంప నెత్తి మీద పెట్టుకుని వెంటనడిచింది. దారిలోనే ఒక గ్రామం తగిలింది. ఆ ఊర్లో రెండు రోజులుండి తిరగ్గా ఇద్దరికీ పని దొరికింది. ఆడకూలీకి ఎనిమిది రూపాయలిస్తామన్నారు. మగవాడికి పది రూపాయలు. సంబరంగా ఇద్దరూ పనిలోకి దిగారు. ఊరిమాట మరిచి.

ఇరవై రోజులు పనిచేసేసరికి యాదయ్యకు సాయంత్రానికల్లా గుడుంబా ముంత అందుకోవాలనిపించేది. తాగి ఇంటికొచ్చేసరికి చేతిలో ఐదు రూపాయలు మిగిలేవి. ఇద్దరి మధ్య మాటామాటా పెరిగేది. రెండు దెబ్బలుకూడా బక్కమ్మ రుచిచూసేది.

అక్కడ పని నాలుగు నెలలు సాగింది. ఊరికి వెళ్ళగానే ముసల్ది కనబడ లేదు. ''అయ్యా నేనుకూడ మీ యంటొస్త ఈడ పనిలేదు. అవ్వకు రెండురోజులు జొరం కాసింది. గంజి తాగలేదు తెల్లారికి కట్టెయిపోయింది. మన శాయన్న సాయపడ్డడు. నాకేంతెల్దు ఏడ్సుకుంటూ శాయన్నకాడికి పోయిన'' అన్నాడు పన్నెండేళ్ళ పోలిగాడు.

నాలుగు రోజులయింతరువాత కొడుకునుకూడా తీసుకుని బయలుదేరి, చేరుకున్న ఊళ్ళో రచ్చబండదగ్గర జనం మూగివున్నారు. ఘర్షణలూ, తగాదాలు దూకుడుమాటలూ జరిగాక-రచ్చబండ ఖాళీఅయింది. ఆ రాత్రి అక్కడ కునుకు తీశారు యాదయ్యా బక్కమ్మ పిల్లలతో.

తెల్లారుతూనే బక్కమ్మ యాదయ్యానులేపి ''రేత్రి అళ్ళ మాటలు విన్నావా?'' అడిగింది.

"ఏంది?''

''పేదోళ్ళకు గుడిసెలేసుకోటానికి పెబుత్వమోరు జాగాలిస్తరంట''

"జాగా లిస్తరా? గుడిసె యేసుకోటానికి?" అతడి ప్రశ్నలో ఆశలేదు-ఆతురత లేదు. రేపటి ఆలోచన లేదు. కూలీ చేసిన డబ్బుల్లో తల్లి చావుకు సాయపడిన శాయన్నకు కొంత డబ్బిచ్చాడు. గోచీ పెట్టుకుని ఓ చింకి బట్టపైన వేసుకుని తిరిగే కొడుక్కు ఒక పంచె, చొక్కా కొన్నాడు. తనొక మార్చు పంచె కొనుక్కున్నాడు. పిల్లదానికి గుడ్డలేదు. కొందామంటె డబ్బులేదు. అడుక్కుని తెచ్చుకున్న గౌను పీలికలయింది-రొట్టెకు పిండి ఆ రోజుక్కూడా చాలదు.

ఊరంతా తిరిగి కూలీ సంపాదించాలి. ఆ డబ్బులతో మరునాటికయినా కడుపు నిండా రొట్టెతినాలి.

''ఏందే జాగా అంటవు?'' నిర్లిప్తతతో మెల్లగా గొణిగాడు.

''గుడి నేసుకోడానికయ్యా''

''అందరికీ ఇస్తరా?"

''ఇస్తరంట లేనోళ్ళకు"

యాదయ్యకు నవ్వొచ్చింది. పట్టరాని నవ్వొచ్చింది. "గుడంబ దొరుకుతు. లేదు. అడి నుంచి మడిసిని మారిపోనావు. ప్రతిదానికి నవ్వుతావు. జాగాదొరికితే గుడి సేసుకోని ఉండచ్చుగదయ్యా?" అంది.

మళ్ళి ఒక వెడదనవ్వునవ్వాడు యాదయ్య.

''గుడిసెలెవరికి?కూడుగుడ్డా ఉన్నోళ్ళకే పిచ్చిదానా? కడుపుకు గంజిలేక పోతే జాలి ఉండదా? మడిసి బతుకుతాడా? బతికినంత ఒంటికి గుడ్డ, గుడ్డ దొరికి నంత గూడు గూడుంటే బతుకుతవా? గుడ్డముక్కుంటే సాలా? ముందుగల కడు. పుకు కూడు యెతుక్కోవాలి మనం. ఈ ఉళ్ళో పనిలేకపోతే గూడు కట్టుకుని ఏం తింటవు? పిల్లగాండ్ల కేంపెడతవు? యేడతిండిదొరికితే ఆడికి పోయేటోళ్ళం-మనం. ఈడ జాగా ఏంచేస్తవు?"

"సర్కారోళ్ల ఇస్తమంటె మనం తీస్కుంటేతప్పా?''

తలఅడ్డంగాతిప్పాడు యాదయ్య. "సూడు కడుపుకుతిండి ఉన్నోళ్లుగూడు. కట్టుకుంటరు. మనం తిండికిలేక పనిఎతుక్కుంటూ ఊళ్లతిరుగుతున్నం. పని ఏడ ఉంటే ఆడికి పోతున్నాం. కూలి సేసుకుని కడుపుకింత తింటున్నాం. పాత పేగు. లయిన చుట్టుకుంటున్నాం. చెట్టుకిందయిన పంటున్నం మనకిప్పుడు కూడుకావాలి. గుడ్డా గూడు ఆ వెనక మనది గంప సంసారం. ఈ తిరుగుడు సంసారానికి గూడెందు కంట? కడుపుమాడంగ - సుట్టుకోడానికి గుడ్డముక్కలేక గూట్లోకూకుంటావా? కూకుంటె పానముంటదా?''

ఎంతచెప్పినా బక్కమ్మకు అర్థంకావటంలేదు. "సర్కారోళ్ల ఇస్తమంటె ఒద్దంటడు పిచ్చోడు. ఈడితోయెగేదెట్టాదేవుడా? రేపు పిల్లగాడయిన గూడు కట్టు కుంటడేమో?'' బ్రతిమాలుకుంటున్నది యాదయ్యను. ఆమెకు చేతికందింది. పోగొట్టుకుంటున్నట్లుగా బాధ కలుగుతోంది.

నీకు తెల్దు పోలిగాడు గూడుకట్టేదాకా జాగా ఉండదు. అది మనకు గిట్టు. బాటుకాదు. ఈ ఉళ్ళో ఇప్పుడు పనులు దొరకవంట గంప సర్దుపోదం''

"ఏడకి?"

"కూలి దొరికే తావికి"

''కూడూ-గుడ్డా-గూడూ'' సణుగుతూ మళ్లీ సంసారాన్ని గంపకెత్తింది యాదయ్యకు. ఆమె మనసులో జాగా దానిలోగూడు మెదులుతున్నది.

"ఈ జల్మకు గూడులేదు. నడునడు. పొద్దెక్కిపోతది" యాదయ్య అదిలిస్తున్నాడు.

బక్కమ్మ అమాయకపు మనసుకు తెలియదు. ప్రభుత్వమయినా అందరికీ జాగా లివ్వదనీ-వందమందికిచెప్పి ఏ పది మందికో ఇస్తుందనీ-మిగతావాళ్ళకు ఆశలు కల్పిస్తుందనీ. ఆశలతోనే బతికేజనాన్ని తనచుట్టూ తిప్పించుకుంటుందని తెలియని బక్కమ్మ అడుగులో అడుగులేసుకుంటూ నడుస్తోంది యాదయ్యవెంట. పాపం జాగాకోసం తిరగటానికయినా కడుపులోకి కూడుకావాలని అనుకోవటం లేదు.